# కథల పోటీ ఫలితాలు

2. ముందరికాళ్ళకు బంధం - ధనరాజ జ్ఞానేశ్వర్
3. నైజం - శ్రీమతి కె. జ్యోతిప్రకాష్, ధవళేశ్వరం

**మూడవ బహుమతి**

**పొందిన కథలు**

1. సెంటిమెంట్ - వడ్లమూడి దుర్గాంబ, శ్రీశైలం ప్రాజెక్ట్
2. ఒక బాల్యంబు - ఎల్.ఉమాజీ, మణుగూరు
3. తెల్లారింది - వినమూర్తి, ఆత్మకూరు, మహబూబ్‌నగర్ జిల్లా.

పై బహుమతులు పొందిన కథలకు వరుసగా రు: 125, 75, 50 చొప్పున పారితోషికం వుంటుంది. ఇవిగాక, దాదాపు 50 కథలను సాధారణ ప్రచురణకు ఎంపిక చేశాము. ఆయా రచయితలకు వ్యక్తిగతంగా తెలియజేస్తాము. సాధారణ రచనలకు 30 రూపాయిల పారితోషికం వుంటుంది. విజేతలకు, పాల్గొన్నవారికీ అభినందనలు.

— ఎడిటర్

వినాయకచవితి కాంప్ దాటిన కథల పోటీలో

రు.50 మూడవ బహుమతి పొందిన రచన

## సెంటిమెంట్

ఈ ప్రపంచంలోకెల్లా విచిత్రమైన వ్యక్తి నాకు నా భార్యే! ఆమె అంతటి పక్కా ప్రాక్టికల్ మనిషిని నేనింత వరకు చూడలేదు! చూడబోను కూడా! వింటే మీరే ఆశ్చర్యపోతారు. మా పెళ్ళయిన తరువాత "నన్ను మొదటిసారి చూసినపుడు నువ్వేలా స్పందించావ్ సుజా" అంటే "స్పందనేమిటి నా స్నేహ్! మీలో నాకు లోపాలేమీ కన్పించలేదు ఓ.కే. అన్నాను" అంది.

అప్పట్నుంచి ఈనాటివరకు నేను ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుంటూ అందమైన సాయంత్రాలు గడపడం, ఆమె తెల్లని చీర, మల్లెపూలతో నా కోసం



ఎదురుచూడడం, నేనొచ్చేవరకు భోంచేయకుండా ఆగడం ఇలాంటి చిన్న చిన్న అనుభూతుల్ని (నా దృష్టిలో ఎంతో పెద్దవి) ఎన్నో కోల్పోయాను. నేనంటే సరే అలవాటుపడిపోయాను. పిల్లల్నీ అలాగే పెంచుతుంది. అదేమంటే "వాళ్ళని 'సెంటిమెంటల్ ఫూల్స్'గా తయారుచేయడం నాకిష్టం లేదు" అంటుంది.

ఆరోజు ఆదివారం. నాకు పిల్లలతో కలిసి భోజనం చేయడమంటే ఇష్టం. ఆమె దృష్టిలో అది కూడా వెధవ సెంటిమెంటే. "ఎవరికి ఆకలయితే వాళ్ళు తింటారు. ఒకరి కోసం ఒకరు తింటారా" అంటుంది. నేనూ పిల్లలూ తినేసరికే రెండయింది. తను ఇంకా భోంచేయ లేదు. పనేమీలేదు. వూరికే కూర్చుంది. "అదేంటి భోంచెయ్యవూ!" అన్నాను ఆశ్చర్యంగా. "ఎందుకో తినాలనిపించడం లేదండీ!" అంది. "ఏం ఒంట్లో బాలేదా" అన్నాను ఆత్రంగా. "అబ్బే అదేం లేదు, ఎందుకోమరి". మూడయింది! నాలుగయింది. చెప్పినా వినే మనిషి కాదని నేనూ చెప్పలేదు.

నాలుగున్నరవుతుండగా ఇంటి ముందు "మాతా అన్నపూర్ణేశ్వరీ" అని కేక వినబడింది. "ఇప్పుడేం అన్నం" అని నేనసే లోపునే లోపల్నుంచి పళ్ళెంలో అన్నం కూరలతో వచ్చింది సుజాత. "ఏం తాతా ఇప్పుడా రావడం! లేటయిందేం!" సుజాత ఆప్యాయంగా అడుగుతోంది. "జొరమొచ్చినాదమ్మా. నీ చేతి పెసాదం తింటేగాని తగ్గదు తల్లీ" అతనంటున్నాడు.

సుజాత నవ్వుతూ లోపలికొచ్చి అక్కణ్ణుంచి నేరుగా వంటింట్లోకెళ్ళి తనకి వడ్డించుకోసాగింది. నేను గమనిస్తూనే వున్నాను. అప్రయత్నంగా నా పెదవులపై నవ్వు విరిసింది. "నువ్వు ఓడిపోయావ్ సుజా" "ఏమిటి" అంది. "నువ్విప్పటి వరకూ అన్నం తినక పోవడానికి కారణం ఆ భిక్షగాడు. వాడికి పెట్టనిదే నువ్వు తిన్లేకపోయావ్. మెదడు ప్రాక్టికల్‌గా ఆలోచించినంత మాత్రాన, మనసుని చంపేయలేవు సుజా, ఒప్పుకుంటావా?" ఆమె ఆశ్చర్యంగా నావైపు కళ్ళు పెద్దవి చేసి చూసింది. ఆ కళ్ళలో ఏదో కొత్త వెలుగు కనబడింది. కనపడిందా, నా భ్రమా?

— వడ్లమూడి దుర్గాంబ



ఉబ్బి తబ్బిబ్బై పోయాడు ఆయన. తన కోసం అల్లుడు స్టేషన్‌కి రావాలనుకోవడం, తన కోసమే భోజనం చెయ్యకుండా ఎదురు చూడడం... సామాన్యమైన విషయాలు కావు మరి! ఎప్పుడూ మొహం ముటముటలాడించే మనిషి ఇలా ప్రవర్తించడం వింతే కదా! ఆ వింత కూడా అతనంతగా పట్టించుకోలేదు.

మనిషికి మార్పు సహజమే కదా! అల్లుడు కూడా మారిపోయాడేమోననుకున్నాడు ఆయన.

తింటున్నంత సేపూ- అల్లుడు అది వడ్డించుకోమనీ, ఇది వడ్డించుకోమనీ బొరవగా అతని ప్లేట్లో రకరకాల వంటకాలు వేస్తూనే వున్నాడు వద్దన్నా వినకుండా. పక్కనే నిల్చున్న కూతురు కూడా అతడి మాటకు వత్తాసు పలుకుతూ వద్దంటున్నా తినమని ప్రోత్సహిస్తోంది. కూతురు, అల్లుడు తన పట్ల చూపుతున్న ఆదరణకు ఆ తండ్రి హృదయం ఉప్పొంగిన కడలి కెరటంలా విరుచుకుపడసాగింది.

భోజనం పూర్తి కాగానే అల్లుడు టవల్ అందించాడు. కూతురు తాంబూలం అందించింది.

హాయిగా కూర్చున్న తరువాత- ఆ విషయం ఈ విషయం మాట్లాడుతూ, చిన్నగా అసలు సంగతి బయట పెట్టింది హిమజ.

పక్కనే శ్రీనాధరావు న్యూస్ పేపర్ చదువుతూ కూర్చున్నాడు.

"మీ అల్లుడి గారికి ఆఫీసుకీ, ఇంటికీ చాలా దూరం కద నాన్నా! ప్రతి రోజూ సిటీ బస్‌లలో అక్కడికీ, ఇంటికీ తిరగలేక యాతన పడుతున్నారనుకో! పోనీ అక్కడే ఎక్కడయినా దగ్గర్లో ఇల్లు అద్దెకు తీసుకుందామంటే అద్దె బరువు మొయ్యలేము. అందుకని... తండ్రి తన మాటలు వింటున్నాడా లేదా అని చూసింది హిమజ. తరువాత అంది.

"... మీకు ఇల్లు కట్టుకోవడానికి లోను సాంక్షనయిందని తెలిసింది. దాంట్లో ఓ పదిహేను వేలు ఇస్తే ఆయన ఓ స్కూటరు తీసుకుంటారు..."

నములుతున్న తాంబూలం చేదెక్కినట్టయింది ఆ తండ్రికి.

- ధనరాజ జ్ఞానేశ్వర్